సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 10 | జనవరి | 2023



విద్యుత్ బిల్లుల ఆదాకు సోలార్
విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం రాయితీపై సోలార్ విద్యుత్ పరికరాలను అందించనుంది. - 8లో▸

మీదికొండలో అరుదైన భైరవ శిల్పం



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో నాలుగు చేతులు కలిగిన అరుదైన భైరవ శిల్పం ఉన్నట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.7°/9.2°

వాతావరణం
జిల్లాలో ఉదయం దట్టమైన మంచు కురుస్తుంది. అలాగే చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

అర్థవంతమైన బోధన చేయాలి



పెద్దవంగర: అర్థవంతమైన బోధనతోనే విద్యార్థులు చదువుల్లో రాణిస్తారని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం, చిట్యాల, గంట్లకుంట పాఠశాలల్లో చేపట్టిన మనఊరు–మనబడి అభివృద్ధి పనులను మండల నోడల్ హెచ్‌ఎం భిక్షపతితో కలిసి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి విద్యార్థుల కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. పాఠశాలల్లో ఉన్న టాయిలెట్‌లను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు పాఠాలు బోధించే తీరును విన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. పదో తరగతిలో 10జీపీఏ సాధించేలా విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఎనగందుల సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షల్లో మార్పులు అవసరం

తొర్రూరు: ఎస్సెస్సీ పరీక్షల్లో మార్పులు అవసరమని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా సంతోష్ అన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ.. పదోతరగతి వార్షిక పరీక్షల్లో 30 శాతం ఆప్షన్లు లేకుండా నిర్ణయించడం సరికాదన్నారు. పరీక్షల్లో మార్పులు కోరుతూ ఈ నెల 11న కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివ, సురేష్, వెంకటేష్, దిలీప్, నవీన్ ఉన్నారు.

సంక్రాంతికి వరంగల్ మీదుగా స్పెషల్ ట్రైన్స్

కాశిబుగ్గ: సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను 12, 13, 14 తేదీల్లో నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ప్రకటించిన జాబితా ప్రకారం.. వరంగల్ మీదుగా 12న సికింద్రాబాద్ టు విశాఖపట్టణం (08506), 13న సికింద్రాబాద్ నుంచి కటక్(07165), కాచిగూడ టు నర్సాపూర్ (07023), 14న హైదరాబాద్ డెక్కన్ టూ నర్సాపూర్(07085), కాచిగూడ టు తిరుపతి(07073) రైళ్లు వరంగల్ స్టేషన్‌లో ఆగుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

నిట్‌లో పది రోజుల జీయాన్ కోర్సు ప్రారంభం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లోని ఖురానా హాల్‌లో సోమవారం పది రోజుల జీయాన్ కోర్సును అట్టహాసంగా ప్రారంభించారు. స్లోవేకియాలోని యూనివర్సిటీ ఆఫ్ బ్రెటీస్లావా ప్రొఫెసర్ జోసెఫ్ బ్రెటిన్స్కీ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి జియాన్ కోర్సును ప్రారంభించి మాట్లాడారు. 'ఇన్‌స్టాబిలిటీస్ అండ్ నేచురల్ డైనమోస్–హైడ్రోడైనమిక్ స్టేబిలిటీ అండ్ డైనమో థియరీ రీవిటెడ్' అంశంపై నిర్వహిస్తున్న జీయాన్ 10 రోజుల కోర్స్ జియోఫిజిక్స్, మ్యాథ్స్, డైనమోల పరిశోధనలకు వేదికగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ.ఉమామహేశ్, ప్రొఫెసర్లు డి.జయకృష్ణ, రాణి, కేవీ.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్

నేటికీ అందని రేషన్ బియ్యం

- డీలర్ల వద్దకు బియ్యం.. లాగిన్ సమస్యతో పంపిణీలో జాప్యం
- సంక్రాంతి పండుగ పిండి వంటలకు ఇబ్బందులు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



బియ్యం పంపిణీ (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: పేదలకు జనవరి కోటా రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీ చేపట్టే ప్రభుత్వం.. ఈ–పాస్ లాగిన్ సమస్యతో ఇప్పటి వరకు జిల్లాలో మొదలుపెట్టలేదు. సంక్రాంతి పండుగ ముందు ఇలాంటి సమస్య ఎదురుకావడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. మరోరెండు రోజుల్లో బియ్యం పంపిణీ చేయకపోతే పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

5కేజీల చొప్పున..

ఆహారభద్రతలో భాగంగా పేదలకు రూపాయికి కిలో చొప్పున బియ్యం సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి నెలకు ఆరుకిలోల చొప్పున సరఫరా చేయగా.. కోవిడ్ నుంచి కేంద్ర ప్రభుత్వం కూడా కొన్ని నెలలు ఒక్కొక్కరికి 10కేజీలు, మరికొన్ని నెలలు 5కేజీల చొప్పున ఉచితంగా బియ్యం సరఫరా చేశాయి. కానీ ఈనెల మాత్రం ఒకొక్కరికి 5కేజీల చొప్పున మాత్రమే బియ్యం సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించింది. ఈ విధంగానే ఈ నెలకు సంబంధించి 15,359అంత్యోదయకార్డులు కలిగిన ఒక్కో కుటుంబానికి 30కేజీల చొప్పున, 2,25,252ఆహార భద్రతా కార్డుదారులు ఒక్కొక్కరికి 5కిలోల చొప్పున, రెండు అన్నపూర్ణ కార్డుదారులకు ఒక్కొక్కరికి 10కిలోల చొప్పున బియ్యం అలాట్ చేశారు. డీలర్లకు కూడా బియ్యం సరఫరా చేశారు.

పండుగ పూట..

ఈనెల 14,15,16తేదీల్లో సంక్రాంతి పండుగ ఉంది. పిల్లలు, బంధువులు ఇళ్లకు చేరుతారు. పిండి వంటలు చేయడం మొదలు పెడతారు. ఇందుకోసం అత్యధిక కుటుంబాల్లో రేషన్ బియ్యం వినియోగిస్తారు. కానీ ఇప్పటివరకు బియ్యం పంపిణీ మొదలుకాలేదు. కాగా అధికారులు స్పందించి పండుగకు ముందుగానే బియ్యం పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్ కాని లాగిన్..

ప్రభుత్వం నుంచి బియ్యం డీలర్ పాయింట్‌కు రాగానే.. రాష్ట్ర సివిల్ సప్లయీస్ శాఖ నుంచి ఈ–పాస్ సప్లై లాగిన్ అవుతుంది. దీంతో సదరు లబ్ధిదారుడికి బియ్యం సరఫరా చేయడం ప్రారంభిస్తారు. ఇలా కార్డు నంబర్ నమోదు చేయడంతోపాటు కుటుంబ సభ్యుడి తంబ్ తీసుకొని బియ్యం పంపిణీ చేస్తారు. ప్రతినెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు లాగిన్ ఉంటుంది. అయితే ఇప్పటి వరకు బియ్యం పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈ–పాస్ లాగిన్ కాలేదు



ప్రతినెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ పూర్తి చేస్తాం. కానీ ఈనెల మాత్రం ఇంకా ఈ–పాస్ సప్లై లాగిన్ కావడం లేదు. టెక్నికల్ సమస్యతో ఆలస్యం అవుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. డీలర్ పాయింట్లకు బియ్యం చేరాయి. లాగిన్ కాగానే పంపిణీ ప్రారంభిస్తాం.

– నర్సింగరావు, డీఎస్‌ఓ, మహబూబాబాద్

సమయం లేదు.. పనులు పూర్తి చేయాలి

12న సీఎం కేసీఆర్ రాకకు వేగంగా ఏర్పాట్లు చేయండి

- ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు సీఎం ఇక్కడే..
- బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం
- 10వేల మంది నాయకులు, అధికారులతో సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్



నూతన కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

సాక్షి, మహబూబాబాద్: 'సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి. ఘన స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉండాలి. సమయం చాలా తక్కువగా ఉంది. రాత్రింబవళ్లు కష్టపడి అన్ని పనులు పూర్తి చేయాలి' అని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో.. ఆయన ప్రారంభించే బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మహబూబాబాద్ పట్టణంలో గ్రీనరీ పెంచాలని మంత్రి దయాకర్‌రావు ఫారెస్టు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని బంధం రోడ్డు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం రోడ్డులో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలిగించి, లూజ్ లైన్లను సరిచేయాలని ఆదేశించారు. సీఎం పర్యటించే మార్గంలో రోడ్లు ఇబ్బందిగా ఉన్నాయని, వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే ఏం చేస్తారు అనేవారికి జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులే నిదర్శనం అన్నారు.

10వేల మందితో సమావేశం

కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం సీఎం కేసీఆర్ 10వేల మంది నాయకులు, అధికారులతో సమావేశమవుతారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. ఉదయం 10గంటలకు హెలికాప్టర్ ద్వారా జిల్లాకు చేరుకుంటారని తెలిపారు. ముందుగా బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభిస్తారని, తర్వాత సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభించి ఇక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులతో సమవేశంలో మాట్లాడుతారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం ముగించుకొని ఇక్కడి నుంచి భద్రాద్రికొత్తగూడెం వెళ్తారని మంత్రి వివరించారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ అంగోతు బిందు, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్

మహబూబాబాద్ అర్బన్: సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28న ప్రభుత్వ ఉపాధ్యాయులు, బీఎడ్, డీఎడ్ విద్యార్థులకు సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈఓ రామారావు సోమవారం తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు, బీఎడ్, డీఎడ్ విద్యార్థులు తమ సెమినార్ పేపర్లను ఫిబ్రవరి రెండో తేదీలోగా ఎస్‌సీఈఆర్‌టీ మెయిల్‌కు పంపాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావును సంప్రదించాలన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

- సైన్స్ ఫెయిర్‌ను సందర్శించిన మంత్రులు దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న మంత్రులు దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత

తొర్రూరు: బాలలను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు,సత్యవతిరాథోడ్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌ను మంత్రులతో పాటు ఎంపీ మాలోత్ కవిత సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను వారు ఆసక్తిగా తిలకించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే టెక్నాలజీలో వచ్చే మార్పులను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ స్థితిగతులను అంచనా వేస్తూ నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. ఆవిష్కరణలు ప్రజల అవసరాలు, సమస్యలు తీర్చేవిధంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదపడుతాయన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయజ్ఞానం పెంపొందించాలని అన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో సమగ్ర మూల్యాంకన విధానం అమలులో ఉందని, దీని ద్వారా పరిశీలనాత్మక విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థులను ఉత్తమ మానవవనరులుగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అంతకుముందు సైన్స్‌ఫెయిర్‌ను అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించి ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శంబారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మండల కోఆప్షన్ సభ్యులు అంకూస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగుల జిగేల్



ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన కలెక్టరేట్ విద్యుత్ వెలుగులతో జిగేల్‌మంటోంది. ఈ నెల 12న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో కలెక్టరేట్ వెలుగులు విరజిమ్ముతోంది.

– సాక్షి,స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

పిల్లల బరువు తూచేదెలా?

వెయింగ్ మిషన్ల కోసం అంగన్‌వాడీల అవస్థలు

- ఈ ఏడాది ప్రభుత్వం నుంచి సరఫరా కాని మిషన్లు
- జీపీలు, మున్సిపాలిటీల నుంచి నిధులు కేటాయించాలని ఆదేశాలు
- కార్యాలయాల చుట్టూ టీచర్ల ప్రదక్షిణలు



చోక్లాతండా జీపీ నుంచి వెయింగ్‌మిషన్‌ను సీడీపీఓకు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

మహబూబాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు వెయింగ్ మిషన్ల కోసం నానా తంటాలు పడుతున్నారు. పిల్లల బరువు కొలిచే మిషన్లు చాలా కేంద్రాల్లో పని చేయడం లేదు. కాగా కొత్త మిషన్ల కోసం గ్రామపంచాయతీలు,మున్సిపాలిటీలు నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటి వరకు స్పందన లేదు. అధికారులు,టీచర్లు మాత్రం ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. వీలైతే దాతలు సాయం చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 1,285 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 152మినీఅంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కాగా జీరో నుంచి ఆరు నెలల వయసు గల పిల్లలు 5,755మంది, ఏడు నెలల నుంచి ఏడాది వయసు గల పిల్లలు 5,344మంది ఉన్నారు. అలాగే ఏడాది నుంచి మూడు సంవత్సరాల పిల్లలు 18,856మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసుగలవారు 21,353మంది ఉన్నారు. మొత్తంగా 51,308 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాలింతలు 5,061, గర్భిణులు 5,467మంది ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. కాగా జిల్లాలోని ఐదు ప్రాజెక్ట్‌ల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయింగ్ మిషన్లు పనిచేయడం లేదు. దీంతో పిల్లల బరువు తూచి నమోదు చేయడం టీచర్లకు తలనొప్పిగా మారింది.

నిధులు కేటాయించాలని ఆదేశాలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయింగ్ మిషన్ల కోసం జీపీలు, మున్సిపాలిటీల నుంచి నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే వాటినుంచి పెద్దగా స్పందన లేదు. ఉదాహరణకు మానుకోట మున్సిపల్ పరిధిలో 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో వెయింగ్ మిషన్ల కోసం సూపర్‌వైజర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించగా.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సమావేశానికి హాజరై తమకు వెయింగ్ మిషన్లు ఇప్పించాలని కోరారు. అయితే ఇంత వరకు ఆదిశగా అడుగులు పడలేదు. జీపీల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

దాతల సాయం కోసం..

జీపీల్లో ఎక్కువ అంగన్‌వాడీకేంద్రాలు ఉంటే అన్నింటికి కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. దీంతో ఆయా జీపీల్లో దాతల సాయం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. విషయాన్ని వివరించి వెయింగ్‌మిషన్లు కొనుగోలు చేసి ఇవ్వాలని వేడుకుంటున్నారు. కాగా టీచర్లు, సూపర్‌వైజర్లు వెయింగ్ మిషన్ల కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదేశాలు జారీ చేశాం..

డిజిటల్ మిషన్లు పని చేయడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాగా గ్రామాల్లో అయితే జీపీ కార్యాలయం నుంచి, మున్సిపాలిటీల్లో అయితే మున్సిపల్ కార్యాలయం నుంచి వాటిని కొనుగోలు చేసి ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. పైనుంచి వచ్చిన ఆదేశాలను మేం జారీ చేశాం. జీపీలు, మున్సిపాలిటీలు అందించాలి. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి మిషన్లు సరఫరా కాలేదు.

– నర్మద, ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమాధికారి

'బడ్జెట్‌లో నిధులు పెంచాలి'



పూలే విగ్రహాల వద్ద లేఖను విడుదల చేస్తున్న తిరుణహరి శేషు తదితరులు

కేయూ క్యాంపస్: బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు డిమాండ్ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం, అభివృద్ధికి నిధులు పెంచాలని సీఎం కేసీఆర్‌కు సోమవారం కేయూ పరిధిలోని దూర విద్యా కేంద్రం వద్ద ఉన్న పూలే విగ్రహాల వద్ద లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 9 బడ్జెట్లలో బీసీల సంక్షేమానికి కేవలం మూడు శాతం కంటే తక్కువగా నిధులు కేటాయించారన్నారు. దీంతో రాబోయే పదో బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. 129 బీసీ కులాల సమగ్రాభివృద్ధి కోసం క్యాస్ట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అంజన్‌రావు, ఎంబీసీ జాక్ రాష్ట్ర కన్వీనర్ పాలడుగుల సురేందర్, బీసీ జాక్ కన్వీనర్ దారబోయిన సతీశ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు చిన్నాల యశ్వంత్‌యాదవ్, తెలంగాణ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు శృంగారపు వినయ్, చారి, తాడబోయిన జితేందర్, ఇమ్రాన్, ధనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు వెంటనే పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ డేవిడ్



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్: ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. వినతులు పరిష్కరించి నివేదిక అందజేయాలని, సమస్య పరిష్కరించకపోతే కారణాలతో నివేదిక పంపాలన్నారు. ప్రజావాణిలో 70దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కేసముద్రం మండలం మహముద్‌పట్నం గ్రామానికి చెందిన వెంకటయ్య తనకున్న భూమిని తన పేరున రికార్డులో నమోదు చేసి పట్టా ఇప్పించాలని వినతిపత్రం అందజేశాడు. గార్ల మండలానికి చెందిన శంకరమ్మ తన భర్త కోవిడ్‌తో మృతి చెందాడని, ఏదైనా అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పించాలని వినతి అందజేసింది. మానుకోట పట్టణానికి చెందిన ఇమామ్ తనకు డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశాడు.
- మానుకోట పట్టణానికి చెందిన రమేష్, విజయలక్ష్మి, సుగుణతో పాటు పలువురు తాళ్లపూసపల్లి రోడ్డులో ప్లాట్లు కొనుగోలు చేయగా కొంత మంది వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ చేసి న్యాయం చేయాలని వినతిలో పేర్కొన్నారు.
- జిల్లా కేంద్రం శివారులోని నిజాం చెరువుశిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆ నిర్మాణాలను కూల్చివేసి కబ్జా జరగకుండా చూడాలని ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, పైండ్ల శ్రీనివాస్ వినతి అందజేశారు.

జాతర పనులు పూర్తిచేయాలి

- 20వ తేదీ వరకు గడువు
- ఐటీడీఏ పీఓ అంకిత్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతర ఏర్పాట్లను ఈ నెల 20కల్లా పూర్తి చేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మినీ జాతరకు 20రోజుల సమయమే మిగిలి ఉండటంతో.. జాతరకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్లపై మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో పీఓ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంపన్న వాగు స్నానఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్ నల్లాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు డ్రెస్సింగ్ గదులను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, ఆరు బయట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. మేడారం ప్రధాన రహదారులు, భక్తులు ఎక్కువ విడిది చేసే ప్రాంతాల్లో కూడా విద్యుత్ లైట్ల ఏర్పాటుపై ట్రాన్స్‌కో, ఐటీడీఏ, ఇంజనీరింగ్ అధికారులు సమీక్షించి కావాల్సిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. నిరుపయోగంగా ఉన్న శాశ్వత మరుగుదొడ్లను భక్తులకు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సౌకర్యాల పరిశీలన..

మేడారంలోభక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పీఓ అంకిత్ అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తుల విడిదికి నిర్మించిన షెడ్లను పరిశీలించారు. షెడ్లలో ఫ్యాన్లు, లైటింగ్, తాగునీటి నల్లాల పనితీరును తనిఖీ చేశారు. షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్న చిన్న సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షకు ముందుగా పీఓ అంకిత్ సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును దర్శించుకుని పూజలు చేశారు.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సు పరీక్షల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో స్క్వాడ్లకు పట్టుబడి ఎనిమిది మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

క్లుప్తంగా

అత్తమామలపై అల్లుడి దాడి

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తమామలు, బావమరిదిపై ఆ ఇంటి అల్లుడు దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలోని వేంనూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వేంనూర్ గ్రామానికి చెందిన బత్తుల ఉపేందర్, అతడి భార్య ఉమా, కుమారుడు రాకేష్ కలిసి తమ వియ్యపురాలు కామిని పద్మపై దాడి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ కోపాన్ని మనసులో పెట్టుకుని కామిని పద్మ కుమారుడు అన్వేష్ తన అత్తమామలపై తన ఇద్దరు మిత్రులతో కలిసి దాడి చేసి గాయపర్చాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్, పీసీలు అమృ, విజయ్‌కుమార్, సంపత్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నేతకు స్వల్పగాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన సంఘటన మండలంలోని శివునిపల్లి శివారు నమిలిగొండ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. వెంకటేష్ జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తిరిగి తన కారులో వస్తుండగా నమిలిగొండ రోడ్డులో పెట్రోల్‌బంక్ మూల మలుపు వద్ద కారుకు ఎదురుగా గేదె వచ్చింది. డ్రైవర్ రవి దానిని తప్పించపోయి పక్కనే ఉన్న విద్యుత్‌పోల్‌కు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఎస్‌కే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

లారీ డ్రైవర్‌కు ఐదేళ్ల జైలు

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం మొండికుంట సమీపంలో ఇద్దరి మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనగామకు చెందిన ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని లారీతో ఢీకొట్టి ఇద్దరి మృతికి కారణమైన మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన లారీడ్రైవర్ సాయినాథ్‌వాగ్‌జీగుండ్లకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జనగామ జిల్లా కోర్టు జడ్జీ శైలజ తీర్పు వెలువరించినట్లు తెలిపారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

- పర్యావరణకు ఎలాంటి నష్టం లేదు
- పరికరాలకు రాయితీ ఇస్తున్న ప్రభుత్వం

హన్మకొండ : విద్యుత్ ప్రస్తుతం నిత్యావసరంగా మారింది. కరెంటు లేకుండా ఏ పనులు జరిగేలా లేవు. మానవుల మనుగడకు గాలి, నీరు ఎంత అవసరమో. ప్రస్తుత పరిస్థితుల్లో గాలి, నీరు కావాలంటే విద్యుత్ తప్పని సరైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఈ థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సాంప్రదాయ వనరుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నాయి. తద్వారా మిగులు విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా జరుగుతుంది. సోలార్ విద్యుత్ పరికరాలకు అయ్యే ఖర్చును 36 నెలల్లో తిరిగి రాబట్టుకోవచ్చు.



తరిగిపోని విద్యుత్ వనరుల చిరునామా సౌరవిద్యుత్

ఉషోదయపు కాంతులు విద్యుత్ ఉత్పత్తికి సోలార్ ప్రధాన వనరు. సూర్యకాంతిని ఒడిసిపట్టి, నిల్వచేసుకొని వాటిని విద్యుత్‌శక్తిగా మార్చగలిగే యంత్ర పరికరాలు ఉంటే సౌర విద్యుత్‌ను గృహావసరాలు, పాఠశాలలు, పోలీసు స్టేషన్లు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు సోలార్ పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది. కాంతులు వెదజల్లే సూర్యుడే సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ ప్యానెల్‌లోని పోటోవోల్టాయిక్ సెల్స్ వెలుతురును ఎలక్ట్రానిక్‌లుగా మార్చి తద్వారా విద్యుత్ శక్తిగా రూపాంతరం చేస్తాయి. సౌర విద్యుత్‌తో పర్యావరణకు ఎలాంటి నష్టం జరగదు. ఇళ్లపై కప్పులో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. విద్యుత్ బిల్లుకు అయ్యే ఖర్చులు చాలా తగ్గుతాయి. గృహ అవసరాలకు పోను మిగులు విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా కావడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో) ద్వారా ప్రభుత్వం సోలార్ విద్యుత్‌కు రాయితీని అందిస్తోంది.

రాయితీ, ఖర్చు వివరాలు...(రూ.లలో)

సామర్థ్యం కిలోవాట్స్	మొత్తం ఖర్చు - రాయితీ	దరఖాస్తు సొమ్ము	నెట్‌మీటర్ ధర	వినియోగదారుడు చెల్లించాల్సింది
1కిలో వాట్	52,000-18,000	1,180	2,950	37,330
2కిలో వాట్	97,800-34,400	2,360	2,950	68,710
3కిలో వాట్	1,43,100-50,400	3,540	2,950	99,140
4కిలో వాట్	1,86,400-57,400	4,720	2,950	1,36,670
5కిలోవాట్	2,33,000-65,600	5,900	2,950	1,76,250
6కిలోవాట్	2,79,600-73,800	7,080	2,950	2,15,830
7కిలో వాట్	3,26,200-82,000	8,260	2,950	2,55,410
8కిలోవాట్	3,72,800-90,200	9,440	2,950	2,94,990
9కిలోవాట్	4,19,400-98,400	10,620	2,950	3,34,570
10కిలోవాట్	4,66,000-1,06,600	11,800	2,950	3,74,150

సోలార్‌తో ఖర్చులు తగ్గించుకోవచ్చు



గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా బిల్లుల ఖర్చులు తగ్గించుకోవచ్చు. నెట్ మీటరింగ్ ద్వారా ప్రభుత్వం రాయితీని అందిస్తోంది. సౌర విద్యుత్ ద్వారా కరెంటు బిల్లులు తప్పుతాయి. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

\- మహేందర్‌రెడ్డి, రెడ్‌కో ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్

మీదికొండలో అరుదైన భైరవశిల్పం

- గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి



నాలుగు చేతులతో ఒక చేతిలో బిచువాతో ఉన్న భైరవ శిల్పం



భైరవ శిల్పం చేతిలో ఉన్న బిచువా ఆయుధం

స్టేషన్‌ఘన్‌పూర్ : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో నాలుగు చేతులు కలిగిన అరుదైన భైరవ శిల్పం ఉన్నట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు బాహువులు కలిగి ఒక చేతిలో బిచువా అనే కత్తి లాంటి ఆయుధం ధరించిన భైరవశిల్పం గ్రామంలో లభించిందని పేర్కొన్నారు. బిచువా అంటే హిందీలో తేలు కుట్టడమనే అర్థం. ఇది తేలు కొండిని పోలి ఉండడం వల్లే ఆ పేరు వచ్చిందని చెప్పారు. బిచువా 20వ శతాబ్దం వరకు అలంకార బాకుగా కొనసాగిందని, ఇతర దేవతా మూర్తుల చేతుల్లోనూ ఈ ఆయుధం కనిపించడం విశేషమన్నారు. జిల్లా అంతటా ఇనుమును సంగ్రహించిన ప్రాంతాలు, ఆయుధాల తయారీలో వ్యర్థాగా మిగిలిన చిట్టెం రాళ్ల గడ్డలు ఉన్నాయని పేర్కొన్నారు. కోల్కొండ మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో 200కి పైగా రాక్షసగుళ్లు ఉన్నాయని, వీటికి దగ్గరలో 50 ఎకరాల దిబ్బ ఉందని వివరించారు. పురావస్తు శాఖ తవ్వకాలు చేపట్టగా నవీన శిలాయుగానికి చెందిన 'కంచు ఉలి' దొరికిందని చరిత్ర పుస్తకాల్లో కనిపిస్తుందన్నారు. భైరవశిల్పాన్ని ప్రస్తుతం హనుమకొండ పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారని తెలిపారు. చారిత్రక ఆధారాలను జనగామ ప్రజలకు అందుబాటులోకి తేవడానికి జిల్లాలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

'శ్రీ చైతన్య' ఘటనలపై విచారణ చేపట్టాలి

- యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: రాష్ట్రంలోని కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే ఘటనలపై సీబీఐతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని, వెంటనే విద్యాసంస్థల యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో శ్రీ చైతన్య విద్యాసంస్థలో విద్యార్థిని చైతన్య ఆత్మహత్యయత్నానికి పాల్పడడాన్ని నిరసిస్తూ సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా మాలోతురాజేష్ నాయక్, నాయకులు ప్రశాంత్, శ్రీనివాసులు, అరుణ్ కుమార్, మహేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఐలోని మల్లికార్జునస్వామి జాతరకు రండి

- సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: శతాబ్దాల చరిత్ర కలిగి, ప్రఖ్యాత శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే జాతర బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, ఆలయంలో పెద్దరథం నిర్వాహకుడు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు ఆహ్వానించారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 13 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు సీఎంకు వివరించారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో కూడిన శ్రీమల్లికార్జునస్వామి చిత్రపటంతో పాటు జాతర ఆహ్వానపత్రికను కేసీఆర్‌కు అందజేశారు. వేదపండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషిలు సీఎం కేసీఆర్‌కు వేదాశీర్వచనం చేయగా ఆలయ ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మలు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఎమ్మెల్యేతో కలిసి ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు కేసీఆర్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆలయం నుంచి ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మల్లన్న ఆలయ మాస్టర్‌ప్లాన్‌ను జతచేసి ఎమ్మెల్యే రమేష్ సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.



సీఎంకు మల్లన్న చిత్రపటాన్ని బహూకరించి జాతరకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి

కాపర్‌వైరు దొంగల అరెస్ట్

- అరెస్ట్ చేసి విచారించిన పోలీసులు
- నిందితుల నుంచి సొత్తు రికవరీ

ధర్మసాగర్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గత 4 నెలలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరుని దొంగతనం చేసిన దొంగలను అరెస్ట్ చేసినట్లు సెంట్రల్ జోన్ల్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్ తెలిపారు. ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ దొంగతనం చేయడంతో గ్రామీణ ప్రాంత రైతులు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొంగలను పట్టుకొని రైతులకు న్యాయం చేయాలని సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు కాపర్ వైర్ దొంగతనాలను చాలెంజ్‌గా తీసుకున్నారు. కాజీపేట ఏసీపీ పి.శ్రీనివాస్, ధర్మసాగర్, హసన్‌పర్తి, మడికొండ, సీఐలు రమేష్, నరేందర్, వేణు, ధర్మసాగర్ ఎస్సై ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి వారికి దొంగతనాలను ఛేదించడానికి తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆ సూచనల మేరకు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వివిధ రకాలుగా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక టీమ్ సమాచారాన్ని సేకరించి సోమవారం ఉదయం రాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద ధర్మసాగర్ సీఐ రమేష్ సిబ్బందితో తనిఖీ చేపట్టారు. తనిఖీలో అనుమానాస్పదంగా నీరేటి రాకేష్, మోతె సారంగపాణి, క్లోం శివ, పొస్తం శ్రీకాంత్‌లు తెల్లని సంచుల్లో సుమారు 90 కిలోల కాపర్‌వైరుని ట్రాలీలో తీసుకెళ్తుండగా వారిని పట్టుకొని విచారించినట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో కాపర్‌వైర్‌ని ఓఆర్ఆర్ రోడ్డుకి దగ్గరలోని రాంపూర్, దేవన్నపేట, కోమటిపల్లి, మల్కాపూర్ గ్రామాల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ని చోరీ చేసి అమ్మేందుకు వెళ్తున్నామని చెప్పారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారితో పాటు మరో ఇద్దరు తూర్పాటి అరుణ్, గంధం పట్టాభి ఉన్నారన్నారు. వారి వద్ద కూడా ఉందని చెప్పగా వారి నుంచి 20 కిలోలు స్వాధీనపర్చుకొని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వీరందరూ 11 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 19సార్లు పలుచోట్ల 30 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ సుమారు 924 కిలోలు దొంగిలించామని చెప్పారు. దొంగిలించిన సొత్తును హనుమకొండ, వరంగల్‌కి చెందిన పాత ఇనుపసామాను కొనుగోలు చేసే వ్యక్తులైన తూర్పాటి సమ్మయ్య, ఊర సాంబ, బాషబోయిన పోశాలు, మోటమ్ రాజయ్య, చత్రాబోయిన చంద్రమౌళిలకు అమ్మినట్లు చెప్పారు. వారి నుంచి డబ్బులు తీసుకొని అందరూ పంచుకొని మందు తాగి, జల్సాలకు వాడుకున్నట్లు తెలిపారని వివరించారు. కొనుగోలు చేసిన వారి నుంచి 814 కిలోలు స్వాధీనపరుచుకున్నామన్నారు. మొత్తం కాపర్‌వైర్ 924 కిలోలు వాటి విలువ రూ.13.23 లక్షలు ఉంటుందన్నారు.

ఉదయం క్యాంటీన్ పని.. రాత్రి చోరీలు

- ఇద్దరిని అరెస్టు చేసిన రైల్వేపోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ జీఆర్‌పీ సీఐ నరేష్

కాశిబుగ్గ: కాజీపేట క్యాంటీన్‌లో పనిచేస్తూ రాత్రి వేళల్లో రైల్వే ప్రయాణికుల ఆభరణాలను దొంగిలిస్తున్న ఇద్దరినీ వరంగల్ జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జీఆర్‌పీ సీఐ నరేష్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ బింద్ జిల్లా చెందిన దీపక్‌సింగ్ రాజ్‌పుత్(22), ఉత్తర్‌ప్రదేశ్ సోనే కాపూర్‌కు చెందిన అతుల్‌సింగ్(23)లు క్యాంటీన్‌లో పనిచేస్తున్నారు. వీరు చెడు వ్యసనాలకు బానిసై పనిచేస్తే వస్తే వచ్చే డబ్బులు సరిపోక రాత్రి వేళల్లో రైళ్లలో నిద్రిస్తున్న మహిళలపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారని సీఐ తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫారం పుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించడంతో వీరిని తనిఖీ చేయగా వారి నుంచి బంగారు పుస్తెల తాళ్లు, నల్లపూసలతాడు, బంగారు గొలుసు, పుస్తెలు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈసమావేశంలో జీఆర్‌పి ఎస్ఐ పరశురాములు, రామకృష్ణ, రమేష్, రాము రియాజ్, రామకృష్ణ, రమేష్, మనోజ్‌కుమార్, రాజు, అనిల్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌గేమ్..

అధిక వడ్డీలే ప్రాణం తీశాయి

- బీటెక్ విద్యార్థికి కన్నీటి వీడ్కోలు



నజీర్‌గౌడ్ మృతదేహం

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో బీటెక్ ఫైనలియర్ ఇంజనీరింగ్ విద్యార్థి బైరగోని నజీర్‌గౌడ్ (23) ఆత్మహత్యకు ఆన్‌లైన్‌గేమ్, అధిక వడ్డీలే పొట్టనబెట్టుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి కళాశాలలో చదువుతున్న నజీర్‌గౌడ్ ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్, తదితర గేమ్‌లు ఆడినట్లు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్స్ కోసం 10 శాతం వడ్డీతో అప్పు చేసి వేలాది రూపాయలు పోగొట్టుకున్నట్లు వాట్సాప్ చాటింగ్ ద్వారా స్పష్టమవుతుంది. ఇలా పోగొట్టుకున్న డబ్బులు స్నేహితులు, ఇతరుల వద్ద అప్పుగా తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు వడ్డీ డబ్బులు ఇవ్వాలని వాట్సాప్ ద్వారా ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో మానసిక ఒత్తిడికిలోనై నజీర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

లేచిరా నాన్నా అంటూ తల్లిదండ్రుల రోదన

నాన్నా ఒక్కసారి లేవరా అంటూ వారు రోదించిన తీరు పలువురి హృదయాలను బరువెక్కించింది. సోమవారం జనగామ ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. స్నేహితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నజీర్‌గౌడ్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.


త్వరలో వందేభారత్ రైళ్లు

- రైళ్ల కోసం ట్రాక్ పటిష్టం
- 130 స్పీడ్ పెంచేందుకు శ్రీకారం

కాజీపేట రూరల్ : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్-కాజీపేట మీదుగా బల్లార్షా, విజయవాడ, కరీంనగర్ తదితర సెక్షన్‌లలో అప్‌అండ్ డౌన్ రూట్‌లలో వందేభారత్ రైళ్లు నడిపించేందుకు ఆయా సెక్షన్లలో రైల్వే ట్రాక్‌ను పటిష్టం చేయాలని రైల్వే ఉన్నతాధికారులు ఆయా సెక్షన్ల ఆఫీసర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం రాత్రి తెలిపారు. బ్రాండ్ గేజ్ రైల్వే ట్రాక్ కిలోమీటర్ నంబర్ కిలోమీటర్ నంబర్ వరకు వేగం పెంచేందుకు అధికారులు టెక్నికల్‌పరంగా మ్యాన్‌పవర్‌ను, టెక్నాలజీని వాడి ట్రాక్‌రూట్‌ను సమర్ధవంతంగా చేసే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా బల్లార్షా రూట్‌లో, వరంగల్ మీదుగా విజయవాడ రూట్‌లో వందేభారత్ రైళ్లను నడిపించేందుకు 130 కేఎంపీహెచ్ ట్రాక్‌పై వేగాన్ని సిద్ధం చేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం..

- మంటలంటుకుని పేలిన గ్యాస్ సిలిండర్
- ఆమెతోపాటు రక్షించడానికి వెళ్లిన మరో ముగ్గురికి గాయాలు
- జనగామ జిల్లాలో ఘటన



ఇంట్లో చెలరేగుతున్న మంటలు



సహాయక చర్యలు చేపడుతున్న పోలీస్ సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఒంటిపై కిరోసిన్‌పోసుకుని నిప్పంటించుకుంది. ఆ మంటలు గ్యాస్ సిలిండర్‌కు అంటుకుని పేలింది. వివాహితతోపాటు ఆమెను కాపాడబోయిన మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్న పిట్టల మధు, జ్యోత్స్న(35)లకు ఇద్దరు సంతానం. పదేళ్ల కుమారుడు సోషల్ వెల్ఫేర్ స్కూల్ హాస్టల్‌లో ఉంటుండగా, పదిహేనేళ్ల కుమార్తె తల్లిదండ్రులతో ఉంటుంది. దంపతుల మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. మధు మూడు రోజుల క్రితం భార్యతో గొడవ పడి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన జ్యోత్స్న సోమవారం రాత్రి ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్‌కు అంటుకుని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన పొరుగింటి వారైన కుంభం రాజు, కుంభం శశితోపాటు నీల వెంకటమ్మలు జ్యోత్స్నను కాపాడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వీరికి కూడా మంటలు అంటుకుని గాయాలయ్యాయి. స్థానిక గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో నీళ్లు తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఏసీపీ రఘుచందర్, సీఐ రాఘవేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివాహితతోపాటు మిగిలిన ముగ్గురు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మొదట స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జ్యోత్స్న 60శాతానికి పైగా కాలినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం నలుగురిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాజీపేట రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణానికి సన్నాహాలు

- వర్చువల్‌లో ప్రధాని శంకుస్థాపన చేసే అవకాశం

కాజీపేట రూరల్ : ఈ నెల 19న హైదరాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదితో కాజీపేట రైల్వేవ్యాగన్ పిరాడికల్ ఓవరాలింగ్ షెడ్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నట్లు సోమవారం రైల్వేవర్గాల ద్వారా తెలిసింది. ప్రధాని పర్యటనలో రూ.7 వేల కోట్ల ప్రాజెక్టు పనులకు శంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కాజీపేట రైల్వేవ్యాగన్ షెడ్‌ను రిమోట్ వర్చువల్‌లో శంకుస్థాపన చేసే అవకాశం ఉందని చేయనున్నట్లు తెలిపారు. కాజీపేట మండలం మడికొండ అయోధ్యపురం వద్ద 155 ఎకరాల విస్తీర్ణంలో రూ.386 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వ్యాగన్‌షెడ్ నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి నిర్మాణ పనుల కోసం ఎదురు చూపులు సాగుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తే అయోధ్యపురం వద్ద వ్యాగన్ షెడ్ నిర్మాణం చేపట్టనున్న స్థలంలో శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లు పనులు ఫౌండేషన్ ఫలకం పనులను మంగళవారం నుంచి చేసే ఆలోచనలో ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

రివార్డుల అందజేత




మహబూబాబాద్ రూరల్: అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా ఎస్పీ శరత్‌చంద్రపవార్ జిల్లా పోలీస్ కార్యాలయం ఐటీ సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పీసీలు సంతోష్‌కుమార్, హరీశ్‌కు సోమవారం రివార్డులు అందజేశారు. జిల్లా పరిధిలో సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్, టీఎస్ కాప్ స్థాపన, అమలు చేయడంలో అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా, ప్రజాసేవ పట్ల నిబద్ధత, విధి పట్ల అంకితభావం ప్రదర్శించడం ఇందుకు గుర్తింపుగా రివార్డులను ఎస్పీ శరత్ చంద్ర పవార్ చేతుల మీదుగా స్వీకరించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎస్పీ అభినందించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళాలు



డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో త్వరలో జరగనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలకు గ్రామస్తులు భారీగా విరాళాలు అందిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, ఆయన కుమారుడు సర్పంచ్ సమ్మిరెడ్డితోపాటు కుటుంబ సభ్యులు రూ.2,00,116 విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోర్ల సత్తిరెడ్డి రూ.1,00,116 అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురవి: ఓపెన్ ఇంటర్మీడియట్, 10వ తరగతిలో స్పెషల్ ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిద్దార్థ హైస్కూల్ హెచ్ఎం అలువాల కార్తీక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు 98852 14380 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు కంటి వెలుగుపై సమీక్ష

చిన్నగూడూరు: నేడు మండలంలోని ఉగ్గంపల్లిలో కంటి వెలుగుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

వైభవంగా శ్రీవారికి సింహాసన ఉత్సవం




మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రతమహోత్సవ పూజా వేడుకల్లో భాగంగా శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయంలో సింహాసన ఉత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

శ్మశానవాటికను ప్రారంభించాలి

నెల్లికుదురు: మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో ప్రభుత్వ నిధుల ద్వారా నిర్మించిన శ్మశానవాటికను ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మెర ఎల్లగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ యోగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో శ్మశానవాటిక, రైతు వేదికలను నిర్మించి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



గార్ల: గార్లకు చెందిన ఎస్‌కె.గఫార్ సోమవారం పశువులను గ్రామ సమీపంలోని పొలంలో మేపుతుండగా, ప్రమాదవశాత్తు మోటార్ విద్యుత్ తీగలకు గేదె కాళ్లు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతిచెందింది. దాని విలువ రూ.80వేలు ఉంటుందని బాధితుడు విలపించాడు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: జిల్లాలో ఈనెల 12న సీఎం కేసీఆర్ పర్యటను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో జరిగిన జరుగుతున్న కోట్లాది రూపాయల పనులతో మానుకోట రూపురేఖలు మారాయన్నారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అభివృద్ధే ఎజెండా పెట్టుకుని పని చేస్తుందన్నారు. అధికారులు కూడా అప్రమత్తమై సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. నూతన కలెక్టరేట్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో మున్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, నాయకులు మార్నేని వెంకన్న, సుధగాని మురళి, రాజు పాల్గొన్నారు.

పెద్దవంగర: ఈనెల 12న జిల్లా కేంద్రంలో తలపెట్టిన సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మండల ప్రధాన కార్యదర్శి సంజయ్, మండల రైతుబంధు సమితి కన్వీనర్ సోమారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న రామయ్య

మహబూబాబాద్ అర్బన్: కోటగిరి మండల కేంద్రంలో ఉపాధ్యాయుడిపై దాడి చేసి అవమానించిన అరాచక శక్తులపై తక్షణమే అరెస్టు చేసి చర్య తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. నిజామబాద్ జిల్లాలోని కోటగిరి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై కొందరు బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు చేసిన దౌర్జన్యాన్ని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, ఎంఈఎఫ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంగటి ప్రభాకర్, నాయకులు యాకయ్య, మల్లిఖార్జున్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్: విద్యార్థుల బలిదానాల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇవాళ దొరల పాలైందని మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. జిల్లాలోని గాజులగట్టు గ్రామ పంచాయతీ 10వ వార్డు సభ్యులు బానోత్ విజయవాలి నాయక్ బీఆర్ఎస్ నుంచి బలరాంనాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా బలరాంనాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతుందని, మానుకోట నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో గూడూరు మండల అధ్యక్షుడు కత్తి స్వామి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యాకుబ్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, నాయకులు సతీష్, వెంకన్న గౌడ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రాక కోసం క్లీన్ అండ్ గ్రీన్

మరిపెడ రూరల్: ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ భవన సముదాయ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రోడ్డు మార్గం గుండా వచ్చే అవకాశం ఉంది. ఈసందర్భంగా సోమవారం మరిపెడ మండలం స్టేజితండా నుంచి మరిపెడ వరకు వరంగల్–ఖమ్మం నేషనల్ హైవే రోడ్డు ఇరువైపుల నాటిన హరితహారం మొక్కలకు పాదులు చేయించారు. రహదారి పొడవున శుభ్రం చేసే పనులను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు.

జయప్రదం చేయండి

గార్ల: హైదరాబాద్‌లో ఈనెల 13, 14 తేదీల లో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.భద్రునాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల సుందర్‌కుమార్, భాస్కరరావు, శివరాం, ప్రసాద్, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నెల్లికుదురు: ఆంగ్లభాష పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మేథాశక్తి పెంపొందుతుందని హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఆలేరు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన విజేతల అభినందన సభలో హెచ్ఎం మాట్లాడారు. ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఆంగ్ల భాష పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

మహబూబాబాద్ అర్బన్: వరంగల్ జిల్లా మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం పొందుటకు ఐదో తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ పి.రామారావు సోమవారం తెలిపారు. ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థుల వయస్సు 2011 మే 1నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తు చేయు విద్యార్థులు ఐదో తరగతి ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల ప్రభుత్వ/ ప్రభుత్వ ఎయిడెడ్/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో తప్పనిసరిగా చదువుతూ ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.గౌట్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములును సంప్రదించాలన్నారు.

బడిబయట పిల్లల గుర్తింపు సర్వే



కేసముద్రం: సర్వే నిర్వహిస్తున్న సీఆర్‌పీలు

కేసముద్రం: మండలంలోని ఆయా గ్రామాల్లో, తండాల్లో సోమవారం చదువుకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించేందుకు, 5కాంప్లెక్స్ పరిధిలో 7గురు సీఆర్‌పీలు ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించారు. సీఆర్‌పీ ఉదయ్, సర్పంచ్ శ్రీను, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పిల్లలు బడుల్లోనే ఉండాలి

నెల్లికుదురు: బడిబయట ఉన్న బడీడు పిల్లలు సర్కారు బడుల్లోనే ఉండే విధంగా చర్య తీసుకోవాలని ఎంఈఓ గుగులోతు రాము సీఆర్‌పీలకు సూచించారు. సోమవారం సీఆర్‌పీలు ఇంటింటికి తిరిగి బడిబయట ఉన్న పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఖలీల్ లహ్మద్, వెంకటేశ్వర్లు, గంగాధర్, సీఆర్‌పీలు బైరు కవిత, జంపాల కవిత, భాస్కర్‌రావు, వారస్వామి పాల్గొన్నారు.

చేపల బాంబుతోనే చేతికి గాయాలు



ఘటనాస్థలంలో ఆనవాళ్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

బయ్యారం: చేపల వేట కోసం ఉపయోగించే చిన్నపాటి బాంబుతోనే రైల్వే ఉద్యోగి బొందకొల్లు రవి చేతికి తీవ్రగాయలైనట్లు గార్ల–బయ్యారం సీఐ బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన బయ్యారం పెద్ద చెరువు వద్ద జరిగిన ప్రమాదస్థలంను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కురవి మండలం గుండ్రాతిమడుగు స్టేషన్ పరిధిలోని రైల్వేగేట్ వద్ద పనిచేసే ఉద్యోగి రవి తన తోటి ఉద్యోగులు ఉమేష్, రాజు, కొమిరెల్లితో కలిసి ఆదివారం చెరువు వద్దకు వెళ్లాడన్నారు. ఈక్రమంలో రవి మలవిసర్జనకు వెళ్లిన సమయంలో శబ్దం వినపడిందని, వెళ్లి చూసే సరికి నీటిలో పడిపోయాడని మిత్రులు తెలిపారన్నారు. వెంటనే రవిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చేపల కోసం ఆ ప్రాంతంలో ఎవరైనా పెట్టిన బాంబును రవి చేతిలో పట్టుకొని వేసే ప్రయత్నంలో ప్రమాదం జరిగిందా లేక వారే వేట కోసం బాంబు తో అక్కడికి వచ్చి నీళ్లలో వేసే సమయంలో ప్రమాదం జరిగిందా అనే కోణంపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. సీఐ వెంట ఎస్సై రమాదేవి ఉన్నారు.

ఫాతిమా ఆశయాలు కొనసాగించాలి



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్ అర్బన్: భారతదేశ మొట్టమొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని ఆమె ఆశయాలు కొనసాగించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె మహబూబ్‌పాష అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత బజారు ఉర్దూ మీడియం పాఠశాలలో సోమవారం ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఇంతియాజ్ నదీంఖాన్, మాఅసోసియేషన్ అధ్యక్షుడు బొద్దుపల్లి ఉపేంద్రం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: స్త్రీవిద్య కోసం కృషి చేసిన భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ ఆదర్శనీయమని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి అన్నారు. ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతిమా, శైలజ, రమ, ఆసియా, రఫీయా, నేహా, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసి జిల్లాకు రావాలి



మాట్లాడుతున్న లోకేష్

గార్ల: జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతే సీఎం కేసీఆర్ మహబూబాబాద్‌లో అడుగు పెట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ అన్నారు. సోమవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గిరిజన యునివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పుతామన్న సీఎం కేసీఆర్ నేటికీ ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం అమలు చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేక పోయారని ఆరోపించారు. శంలో ఉదయ్‌కుమార్, భాస్కరాచారి, తరుణ్, హుస్సేన్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ, డీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



మహబూబాబాద్ అర్బన్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రామారావు



పెద్దవంగర: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఆర్‌యూపీపీ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను డీఈఓ రామారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, జిల్లా సభ్యులు సతీష్‌కుమార్, సంపత్, కరుణాకర్, ఏఎస్ఓ సదయ్య, ఏసీజీఈ మందుల శ్రీరాములు, క్వాలిటీ కోఆర్డినేటర్ బుచ్చయ్య, సీడబ్ల్యూఎస్ఎన్ కోఆర్డినేటర్ ముఖేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

పెద్దవంగర: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కార్యాలయంలో (డీటీఫ్) డెమెక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను సోమవారం మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజలింగం, ఉపాధ్యాయులు భాస్కర్, అమర్, రామచంద్రు, ఎమ్మార్సీ సంతోష్ పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్



మహబూబాబాద్ రూరల్: అరెస్టయిన నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చలో ప్రగతిభవన్ కార్యక్రమాన్ని బయలుదేరుటకు సిద్ధమైన డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మహమ్మద్ రజాక్, భూక్య రాజేష్, మధు, పోదుగంటి బ్రహ్మాచారి, వివిధ నాయకులను వివిధ మండలాలలో సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు.

గార్ల: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని తలపెట్టిన చలో ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న డీవైఎఫ్ఐ మండల నాయకులు బాదం రాజేష్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు.

కేసముద్రం: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా, ఈమేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కేసముద్రంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అశోక్‌స్టాలిన్‌ను ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరు

గార్ల: పాలకులు ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపుతూ, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ఎన్డీ మండల కార్యదర్శి జి.సక్రు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కమిటీ కార్యదర్శి మోర రవిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. మనోహర్, మాన్యా, లక్ష్మినర్సు, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పనికి తగిన వేతనం చెల్లించాలి

చిన్నగూడూరు: పనికి తగిన వేతనం చెల్లించాలని ఆశవర్కర్లు అనిత, వినోద తెలిపారు. సోమవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యాను కలిసి ఆశవర్కర్ల సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఆశాలు జ్యోతి, ఆసియా, మంగ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రూ.10లక్షలు అందించాలి

నెల్లికుదురు: ప్రతి దివ్యాంగులకు స్వయం ఉపాధి కింద రూ.10లక్షలు అందించాలని టీవీవీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ముసిపట్ల జ్యోతి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నగూడూరు: మండల కేంద్రం శివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం ఉదయం పట్టుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ రామకృష్ణను ఫోన్‌లో వివరణ కోరగా స్పందనలేదు.

పాఠశాల తనిఖీ

దంతాలపల్లి: మండలం దాట్ల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను తొర్రూరు మండలం వెల్లికట్టె గెజిట్ ప్రధానోపాధ్యాయులు పోగుల శ్రీనుబాబు సోమవారం తనిఖీ చేశారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. బృందం సభ్యులు నాగరాజు, యాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో పాల్గొనాలి

దంతాలపల్లి: ఈనెల 12 తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో భారతీయ జనత యువమోర్చా రాష్ట్ర పిలుపు మేరకు ఐదు కిలోమీటర్ల పరుగులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనువాస్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చిన్నగూడూరు: మండల కేంద్రంలో మహబూబాబాద్ వెళ్లే రహదారిలో సోమవారం సాయంత్రం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల రికార్డులను పరిశీలించారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో ఏఎస్సై మంగ్యానాయక్, రాము, మోహన్ ఉన్నారు.

ఆర్థికసాయం

తొర్రూరు: మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించి బాల్య మిత్రులు మానవత్వం చాటుకున్నారు. సోమవారం మండలంలోని ఫత్తేపురంలో మృతుడు కొత్తగట్టు హరీష్ కుటుంబానికి పాఠశాల మిత్రులు రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో సందీప్, ఉమేష్, గణేష్, మురళి, సురేష్, యాకన్న పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయాలి

నెల్లికుదురు: మండలంలోని రత్తిరాం తండా శివారు కునాయికుంట తండాకు రోడ్డు మంజూరు చేయాలని తండా ఎంపీటీసీ సభ్యుడు యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం బురదమయమైన రోడ్డుపై తండావాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

కుంభమేళా పోస్టర్ల ఆవిష్కరణ

కేసముద్రం: మహారాష్ట్రలోని గోద్రిలో ఈనెల 25నుంచి 30 వరకు జరగనున్న అఖిల భారతీయ బంజార కుంభమేళా వాల్‌పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో శ్రీపీఠం వల్యానంద, కందళం వాసుదేవాచార్యులు ఆవిష్కరించారు. కుంభమేళాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వీరునాయక్, వెంకన్న, శంకర్, బాలునాయక్, గుగులోతు వెంకన్న, భద్రునాయక్, వీరన్న, శ్రీను, సుక్యా, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మరిపెడ/మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జర్ల గ్రామానికి చెందిన పామర్తి మల్లేష్ వృత్తిలో భాగంగా సోమవారం కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడగా తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రున్ని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్, రామ్మూర్తిగౌడ్, చిర్ర వెంకటేశ్వర్లగౌడ్, పరామర్శించారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో వెన్నం సరోజాదేవి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో సోమవారం మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్, ములుగు ఎమ్మెల్యే దనసరి అనసూయ (సీతక్క), టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి సరోజదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

బయ్యారం: అయ్యప్ప మాలధారులు నిర్వహించిన ఇరుముడి కార్యక్రమం సోమవారం బయ్యారంలో ఘనంగా జరిగింది. స్థానిక రామాలయం వద్ద ఇరుముడుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వాములు శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో మాలధారులు శ్రీనివాసాచారి, కార్తీక్, రమేష్‌రెడ్డి, జగదీష్, వీరారెడ్డి, బాలు, రమేష్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలికను కురవి మండలంలోని నేరడ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రహీం రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశాడన్నారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై బైరు గోపి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారన్నారు. యువకుడిని అదుపులోకి తీసుకుని అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల పక్కన బురదగుంతలు



సాయినగర్‌లో ఇళ్ల పక్కన బురదగుంత

డోర్నకల్: సైడు కాల్వలు ఏర్పాటు చేయక పోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో వర్షం వచ్చిన సమయంలో వరద నీరు రోడ్లపై నిలుస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 13వ వార్డు పరిధిలోని సాయినగర్ నాల్గో వీధిలో ఇళ్లలోని మురుగు రోడ్డు ప్రక్కన, ఖాళీ ప్లాట్లలో చేరడంతో ఇక్కడ పెద్ద బురద గుంతలు ఏర్పడి పశువులు, పందులు చేరడంతో దుర్గంధంతోపాటు దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు స్పందించి వీధుల్లో సైడు కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.